క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మాచర్ల టౌన్ అసిస్టెంట్ ఇంజినీర్ కోటేశ్వరరావు గురువారం తెలిపారు. 33/11 కేవీ శుద్ధగుంతల సబ్ స్టేషన్, 11 కేవీ మాచర్ల టౌన్–1 ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైల్వే ట్రాక్ ఏరియా, ఆర్ అండ్ బీ బంగ్లా ఏరియా, రిజిస్ట్రార్ ఆఫీస్ ఏరియా, బస్టాండు, రామా టాకీస్ లేన్, జెండా చెట్టు తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పిడుగురాళ్ల పట్టణ విద్యుత్ శాఖ ఏఈ సైదారావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలోని యరపతినేని నగర్, చెరువు కట్ట బజార్, రజక కాలనీ, రిక్షా కాలనీ, అడితి సెంటర్, బ్రహ్మంగారి టెంపుల్ ఏరియా, కనకదుర్గమ్మ టెంపుల్ ఏరియా , ఫేమస్ ఫంక్షన్ హాల్ ఏరియా, న్యూ రవితేజ టెక్స్‌టైల్స్ ఏరియా, బస్టాండ్ ఏరియా, సుజనా సహస్ర సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 8 - మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్దనున్న షిరిడీ సాయి దేవస్థానంలో బాబాకు ప్రధాన అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భజనబృందం బాబా గీతాలను ఆలపించింది. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ఆలయాల నిర్మాణానికి కృషి



రెంటచింతల: గ్రామంలోని అతిపురాతనమైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం, శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర శిల్పారామం చైర్మన్ చేరెడ్డి మంజుల అన్నారు. గురువారం మండలంలోని రెంటాల గ్రామంలో ఆలయాలను ఆమె సందర్శించారు. నిర్మాణం కోసం ప్లాన్స్, అంచనాలు తయారు చేయాలని కోరారు. వెంట ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

విశ్రాంత హెచ్ఎంకు పరామర్శ

మాచర్ల రూరల్: గుండె ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న రిటైర్డ్ హెచ్ఎం బొల్లేపల్లి సాంబశివరావును టీటీడీ బోర్డు మెంబర్, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి గురువారం స్థానిక ఎంఎస్ఆర్ టౌన్‌షిప్‌లో ఆయన నివాసంలో పరామర్శించారు. వెంట న్యాయవాది జీవీ, ఇల్లూరి కోటిరెడ్డి తదితరులున్నారు. అనంతరం ఇటీవల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన యర్రాకుల సిద్దమ్మ దంపతులను కలిసి, శాలువాతో సన్మానించారు.

వైభవంగా ప్రతిష్టా మహోత్సవాలు

గురజాల రూరల్: మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజ నేయ స్వామి వారి దేవాలయంలో గురువారం జీవ ధ్వజ నూతన రాజగోపుర శిఖర ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

పేదలకు అన్నదానం

సత్తెనపల్లి: భరత మాత అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా పట్టణంలో ప్రముఖ వస్త్ర దుకాణం సౌందర్య సిల్క్స్ యజమాని, ఆర్య సంఘం పెద్దల కమిటీ సభ్యుడు భవిరిశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం ఆర్థికసాయంతో 121 మందికి గురువారం అన్నదానం చేశారు. పట్టణంలోని రంగా కాలనీ 16,17వ లైన్ల మధ్యలో ఆ ప్రాంత వాసులు జంపని శ్రీహరి, తాడిబోయిన రామారావు అక్కడ ఉన్న కొందరు యువకులు సేవలు అందించారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ రోడ్డులో గల ఫిరోజీ ఋషీంద్రుల మఠంలోని పంచముఖీ వేద గాయత్రీ అమ్మవారి ఆలయంలో గురువారం ఆవిర్భావ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అచ్చంపేట రోడ్డులోని శివాలయం నుంచి అమ్మవారికి పసుపుకుంకుమ, పూల కావిడిలు, శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పానకం కావిడిలతో ఊరేగింపు జరిపారు. అనంతరం మఠంలో గాయత్రీ మాతకు అన్నాభిషేకంతో పాటు హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజల పక్షాన పోరాటమే

వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి వైఎస్సార్ పేరే ఉండాలి
- పథకాలు అమలు చేయకుంటే ఉద్యమాలు తప్పవు
- వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



పిడుగురాళ్ల: అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా అభివృద్ధి పనులు వదిలేసి కక్ష సాధింపు చర్యలు మొదలెట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు వైఖరిపై రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోతే గురజాల నియోజవర్గంలో కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తామని మోసగించారన్నారు.

ఆసుపత్రి, కళాశాల పనులపై దృష్టేది?

వైద్యశాల, కళాశాల నిర్మాణ పనులు పూర్తిచేసేలా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలకు పల్నాడు ప్రాంతాల్లోని సుమారు 12 లక్షల మంది కోసం వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పిడుగురాళ్ల సమీపంలోని కామేపల్లి శివారులో మెడికల్ కాలేజీ, వైద్యశాల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే 90 శాతం మెడికల్ కాలేజీ, 70 శాతం వైద్యశాల పనులు పూర్తయ్యాయన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నప్పటికీ ఈ కూటమి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు కనీసం వైద్యశాల, కళాశాల పనులపై సమీక్ష కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. అభివృద్ధి పనులు చేపట్టకపోతే కోర్టులో పిల్ వేసి పనులు చేయిస్తామని హెచ్చరించారు. కళాశాల, వైద్యశాలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేరు పెడితే, కొంత మంది కూటమి నాయకులు ఆ పేరు తొలగించి ఇతర పేర్లు పెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం మరో వైద్యశాల నిర్మించి కావాల్సిన పేర్లు పెట్టుకుంటే బాగుంటుందన్నారు. 108, ఆరోగ్యశ్రీ వంటి శాశ్వత పథకాలు తీసుకొచ్చి ప్రజలకు దేవుడిగా మారిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేరును తొలగించాలని ప్రయత్నించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో ఒక జిల్లాకి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేరు పెట్టామని చెప్పారు. పిడుగురాళ్లలో నడిరోడ్డులో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అమరావతి రాజధానికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేరును ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. కూటమి నేతల కమీషన్ల కోసం సిమెంట్ ఫ్యాక్టరీలను 40 రోజులపాటు మూస్తే తాము ఉద్యమం చేసి వెంటనే రెండు రోజుల్లోనే తెరిచేలా చేశామని గుర్తు చేశారు. జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి రూ. 52 కోట్ల కేంద్ర నిధులు మంజూరు చేయించి రెండేళ్లు పూర్తవుతున్నా కూటమి ప్రభుత్వం పనులు మాత్రం ఏడాది నుంచి ప్రారంభించకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణంపై కూడా ధర్నా చేసి కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించగానే హడావుడిగా శంకుస్థాపన చేసి, పనులు మొదలుపెట్టారని గుర్తుచేశారు. మెడికల్ కాలేజీ పనులు కూడా వేగవంతం చేసేలా పనులు చేపట్టాలని, రాబోయేది వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని, అప్పుడు తాము పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందించే వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గురజాల నియోజవర్గ ప్రజలు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పురస్కారాలకు ఐదుగురు విద్యార్థులు ఎంపిక



రాగిడి యశ్వంత్



కొరబండి మౌనిక



వాయిరి అహల్య



దుగ్గినేని రమ్య



షేక్ రిజ్వానా

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కారాల ఎంపికలో స్కాలర్స్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, ఎం.జగదీష్‌రెడ్డిలు గురువారం తెలిపారు. పిడుగురాళ్ల మండలంలో ప్రకటించిన ఏడుగురిలో తమ విద్యార్థులు రాగిడి యశ్వంత్(590), కొరబండి మౌనిక (589), వాయిరి అహల్య (588), దుగ్గినేని రమ్య(493) ఎంపికయ్యారని పేర్కొన్నారు. దాచేపల్లి మండలానికి చెందిన స్కాలర్స్ విద్యార్థిని షేక్ రిజ్వానా (583) ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పల్నాడు విద్యార్థికి పీహెచ్‌డీ సీటు



అన్నం సురేంద్రకుమార్‌ను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ నరసింహారావు

పిడుగురాళ్ల: పట్టణంలో పేద కుటుంబంలో జన్మించిన అన్నం సురేంద్ర కుమార్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో సీటు సాధించాడు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసి ఆల్ ఇండియా లెవెల్ జీఆర్ఎఫ్ 66వ ర్యాంకు సాధించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ సీటు సాధించినందుకు సురేంద్ర కుమార్‌ను పలువురు సన్మానించి, అభినందనలు తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్ రావు, అధ్యాపకులు సాదినేని నరసింహారావు, సోమశేఖర్, శ్రీనివాసరావు, సురేష్, వీరాంజనేయులు విద్యార్థిని అభినందించారు.

ప్రమాద బీమాతో కుటుంబానికి భరోసా



గోపీనాథ్‌కు చెక్కు అందచేస్తున్న ఆర్ఎం పి. రవికుమార్, మేనేజర్ ఆంజనేయులు నాయక్

రెంటచింతల: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందచేస్తున్న వ్యక్తిగత బీమా తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించిన సమయంలో ఆ కుటుంబానికి ఒక ఆర్థిక రక్షణగా పథకం అమలు చేస్తున్నట్లు బ్యాంకు రీజినల్ మేనేజర్ పి. రవి కుమార్ అన్నారు. గురువారం రెంటచింతలకు చెందిన నీల సత్యనారాయణ, పద్మావతి దంపతులు 2024 నవంబర్ 16 న సత్రశాల వద్ద కృష్ణానదిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృత్యువాత పడ్డారు. వారి కుమారుడు గోపీనాథ్‌కు రూ. 40 లక్షల చెక్కును స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ ఆంజనేయులు నాయక్‌తో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. ఎస్‌బీఐలో కేవలం రూ. 2 వేలకే వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్న కుటుంబం ... పెద్ద దిక్కు కోల్పోయినా రూ. 40 లక్షల బీమా అందచేసి ఆర్థిక తోడ్పాటు అందిస్తుందన్నారు. నరసరావుపేట పరిధిలో 542 బ్రాంచీలు ఉన్నాయన్నారు. బీమాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీవీఐ మేనేజర్ చిన్న సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణం



ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే తదితరులు

సత్తెనపల్లి: రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులంతా రైతులకు చేదోడువాదోడుగా ఉండాలని తెలిపారు. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ చేసి, మొక్కలు నాటారు.రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు.

చైర్‌పర్సన్‌గా శోభారాణి

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కోమటినేని శోభారాణి ప్రమాణ స్వీకారం చేశారు. గతంలోనే ప్రమాణ స్వీకారం నిర్వహించాలని ఆర్భాటంగా తలపెట్టారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి జీఓ విడుదల కాకపోవడంతో దాన్ని అభినందన సభగా అప్పటికప్పుడు మార్చారు. జీవో రాకపోవడంతో ప్రమాణ స్వీకారం వాయిదా వేశారు. గత నెల 26న జీవో 329 విడుదల కావడంతో గురువారం ప్రమాణస్వీకారం అధికారికంగా నిర్వహించారు. ఏఎంసీ గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా సిరిగిరి ఆదిలక్ష్మి, మెంబర్లుగా బత్తుల సుజాత, బత్తుల వెంకటలక్ష్మి, గొర్రెపాటి సుశీల, గుంటూరు షేక్ బడాఅలీ, గురజాల నాగమల్లేశ్వరి, కానుగుల శివశంకరరావు, మారిశెట్టి రామ సైదులు, పాటిబండ్ల పూర్ణచంద్రరావు, పోలూరి యల్లమంద, రాపూరి మాధవి, గనికపూడి సంసోనా, హెచ్‌జీ తులసి, పోతుగంటి రామ కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చర్లంచర్ల లక్ష్మీ తులసి, మార్కెటింగ్ శాఖ ఏడీలు, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

నకరికల్లు: ప్రతి విద్యుత్ వినియోగదారుడు పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని, సిబ్బంది కూడా అవగాహన కల్పించాలని పల్నాడు జిల్లా ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, బకాయిలు 100శాతం వసూలు చేయాలని తెలిపారు. రెండవ శనివారం లైన్ మెయింట్‌నెన్స్ చేయాలని, నూతన సర్వీసులు సత్వరమే మంజూరు చేయాలని సూచించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రావూరి చెంచమ్మ (45) ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవిస్తుంది. కుమార్తె కుటుంబం అమీన్‌సాహెబ్‌పాలెంలో నివసిస్తుండటంతో వారితో కలిసి ఉంటోంది. గురువారం ఉదయం ఓ ఇంట్లో పనులు చేసేందుకు వెళ్ళింది. నీళ్ల చిమ్మే క్రమంలో వేలాడుతున్న కరెంటు వైరుకు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

వరకట్న వేధింపులపై కేసు

నాదెండ్ల: వరకట్నం వేధింపులపై నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. చందవరం గ్రామానికి చెందిన స్వర్ణలతతో బాపట్ల జిల్లా చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామానికి చెందిన హేమంత శివకోటిరెడ్డితో వివాహమైంది. కొద్దిరోజులకే భర్త, అత్తమామలు కలిసి అధికకట్నం తెమ్మంటూ ఒత్తిడి చేసి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

అచ్చంపేట: అరవై మందితో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న కందకంలోకి దూసుకు పోయింది. కొద్దిమందికి గాయాలు మినహా మిగిలిన వారంతా సురక్షితంగా బయటపడిన ఘటన మండలంలోని ఓర్వకల్లులో గురువారం చోటు చేసుకుంది. అమరావతికి చెందిన రామిశెట్టి వెంకటేశ్వరరావు బంధువులతో అమరావతి నుంచి మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమతల్లి దేవాలయానికి మొక్కుబడులు తీర్చుకునేందుకు లారీలో బయలుదేరాడు. ఓర్వకల్లు వద్దకు చేరుకునే సరిగా ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న కందకంలోకి లారీ దూసుకు పోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో కొద్దిమందికి స్వల్ప గాయాలు కాగా మిగిలినవారంతా సురక్షితంగా బయటపడ్డారు. అయిదుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని అచ్చంపేట వైద్యశాలకు తరలించారు. మరో 10మందికి స్వల్ప గాయాలయ్యాయి.

పోలీసు సిబ్బందికి శాఖాపరంగా అండ



నరసరావుపేట రూరల్: నిరంతరం ప్రజా రక్షణ కోసం పాటుపడే పోలీసు సిబ్బందికి అండగా ఉంటామని జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్ తెలిపారు. జిల్లాకు చెందిన హోంగార్డు టీవీకే బాజీ డిప్యుటేషన్‌పై వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేశాడు. బాజీని అడిషనల్ ఎస్పీ పూలమాల, శాలువాతో సత్కరించారు. కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తూ ఈనెల 21వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన జె.చెన్నకు అడిషనల్ ఎస్పీ చేతుల మీదగా రూ.5 లక్షల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాచర్ల: కార్యక్రమంలో న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ తదితరులు



విజయపురి సౌత్: మొక్కలు నాటే కార్యక్రమంలో ఈఈ అప్పాజి తదితరులు



రెంటచింతల: మొక్క నాటుతున్న ఎంపీడీఓ కె. సరోజినిదేవి, అధికారులు



రెంటచింతల: విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

మాచర్ల: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో మాచర్ల శ్రీశైలం రోడ్‌లో గల నగరవనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ మహమ్మారి వల్ల భూమి, నీరు కలుషితం అవుతోందన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని అందరం తరిమి వేయాలన్నారు. మొక్కలు నాటారు. మాచర్ల ఫారెస్ట్ రేంజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరవనంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కొన్ని రకాల ఔషధ మొక్కలు కూడా ప్రజల సౌకర్యార్థం నాటి సంరక్షిస్తున్నామన్నారు. ఫారెస్ట్‌లో జంతువులకు నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మాచర్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలం సేవా కమిటీ సభ్యుడు, స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పిల్లలకు పర్యావరణం, మొక్కల పెంపకం, నీటి పొదుపు, ప్లాస్టిక్ నివారణ గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గుంజే వరప్రసాద్, న్యాయవాది శేషిరెడ్డి, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుడి జల విద్యుత్ కేంద్రంలో...

విజయపురి సౌత్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నాగార్జునసాగర్ కుడికాలువ జలవిద్యుత్ కేంద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ అప్పాజి అన్నారు. గురువారం ఈఈ ఉద్యోగులతో కలిసి విజయపురి సౌత్‌లోని కుడి జలవిద్యుత్ కేంద్రంలో వివిధ రకాలకు చెందిన వంద మొక్కలను నాటి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ వాహనాలు వినియోగాన్ని తగ్గించటం వలన చమురు వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.రాజారెడ్డి, ఓ అండ్ ఎం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎండీ అక్బర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి. రామకృష్ణ, బి.మోహన్ బాబు, ఏఎస్ఐ సత్యమూర్తి, భద్రతా సిబ్బంది, ఆసుపత్రి, కాంట్రాక్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసఫ్స్ పాఠశాల ఆవరణలో..

రెంటచింతల: మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని మండల అభివృద్ధి అధికారి కె. సరోజినీదేవి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆమె వివిధ శాఖాధికారులు, నాయకులతో కలిసి మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం చెట్లను విచక్షణ లేకుండా నరకడంతోపాటు మొక్కలను నాటకపోవడం వలన వాతావరణం కాలుష్యంతోపాటు అనేక సమస్యలు ఏర్పడుతున్నట్లు తెలిపారు. వాతావరణ సమతుల్యత కోసం యువత ముందుకు వచ్చి గ్రామాలలో మొక్కలు నాటి సంరక్షించాలని ఆమె కోరారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఏఈ షేక్ మస్తావలి నేతృత్వంలో సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 వై. శివ నాగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, స్కూల్ హెచ్ఎం దుర్గాప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీఓ జి. చిన వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు సీహెచ్ అబ్బిరెడ్డి, బి. రామకృష్ణ, మూలి రాజారెడ్డి, మున్నా ప్రభురాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం పెంపు ఎంతో అవసరం



మాచవరం: మొక్క నాటుతున్న విజయలక్ష్మి తదితరులు



గురజాల: మొక్క నాటుతున్న జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని తదితరులు

మాచవరం: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి సూచించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన మాచవరంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనంతో ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు

అందరి భాగస్వామ్యం అవసరం

గురజాల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , పదో అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని అన్నారు. స్థానిక కోర్టు భవనాల నుంచి బ్రహ్మనాయుడు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.అలేఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, మందపాటి శ్రీనివాసరెడ్డి, కర్రా చినకోటేశ్వరరావు, కె.ప్రభుదాసు, కత్తి చలమ రాజు, చాగంటి సురేష్, దార్ల కిరణ్ దాసు, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సాగర్ రోడ్డు బ్రాంచి (12678), మాచర్ల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522426.

డిమాండు నోటీసు

(సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

ఋణగ్రహీతలు/హామీదారులు పేరు మరియు చిరునామా: 1) శ్రీ గన్నెబోయిన అశోక్‌కుమార్, తండ్రి: శ్రీనివాసరావు, డోర్ నెం. 2-83, గొట్టిపాళ్ళ గ్రామము, [illegible] మండలం, పల్నాడు జిల్లా-522613. 2) శ్రీమతి గన్నెబోయిన అన్నపూర్ణ, భర్త: అశోక్‌కుమార్, డోర్ నెం. 2-83, గొట్టిపాళ్ళ గ్రామము, [illegible] మండలం, పల్నాడు జిల్లా-522613, మరొక చిరునామా: డోర్ నెం. 11-2-233, రామా టాకీస్ రోడ్, [illegible] మాచర్ల, పల్నాడు జిల్లా-522426.

చెల్లించవలసిన బకాయి: తేది.15.05.2025 నాటికి ABL A/c No. 40977627975, ABL A/c No. 40977624850 క్రింద బకాయి రూ.27,66,294/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల అరవై ఆరు వేల రెండు వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే) మరియు భవిష్య వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు మొదలైనవి.

డిమాండ్ నోటీసు తేది: 15.05.2025 NPA తేది: 09.05.2025

స్థిరాస్తి యొక్క వివరములు

[illegible] దస్తావేజు నెం. 1345/2022, తేది.19.03.2022 ప్రకారము శ్రీ గన్నెబోయిన అశోక్‌కుమార్, తండ్రి: శ్రీనివాసరావు గారికి చెందిన ఆస్తి, పల్నాడు జిల్లా, [illegible] నెం.14, డి.నెం. 1096, అసెస్‌మెంట్ నెం. 1022004374, [illegible] రోడ్డు, [illegible] డోర్ నెం. 14-2-633 [illegible] 427.06 [illegible] ఆర్‌సీసీ రూఫ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: [illegible] -98 లింకులు; దక్షిణం: [illegible] -80 లింకులు; పడమర: MCH పీరారెడ్డి యొక్క ఆస్తి-97 లింకులు; ఉత్తరం: 20 లింకులు [illegible] రోడ్డు-91 లింకులు.

పైన చెప్పబడిన ఋణగ్రహీతలు/హామీదారులు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, సాగర్ రోడ్డు బ్రాంచి, మాచర్ల, పల్నాడు జిల్లా వారి నుండి ఋణం పొందియున్నారు. [illegible]

తేది : 15-05-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : మాచర్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com